# కృతజ్ఞత

—పి.ఎల్.ఎన్. మంగారత్నం

నా ప్రక్క సీటు దగ్గరకి చాలా రోజులుగా ఓ ముసలతను వచ్చిపోవడం చూస్తున్నాను.

అతను ఎందుకు వస్తున్నాడో! ఏమో!

గంటల తరబడి కుర్చీని అంటుకుని వదలడు. ఒక్కోసారి ఆఫీసు వాళ్ళే నిలబడి మాట్లాడి వెళ్ళిపోతుంటారు.

ఏదో బాతాఖానీ వేస్తుంటాడు. ఆ సెక్షన్ క్లర్కు వెంకట్రావుది ఈ వూరే, స్వంత ఊరు కావడంతో తరచు ఎవరో ఒకరు ఆఫీసుకి వచ్చి అతని టైము పాడుచేస్తుంటారు. టైము పాడౌతుంది అని ఎదుటి వాళ్ళు అనుకోవడమేగాని, అతనికి ఏ మాత్రం ఆ ఆలోచన ఉండదు.

ఆఫీసరు అసలే హడావుడి మనిషి. ప్రతి విషయం నిముషాల మీదే డిస్పోజ్ అవ్వాలని అనుకుంటారు.

కబుర్లతో కాలక్షేపం చేసి గంటకి ఒక ఫైలు కూడా వ్రాయని వెంకట్రావుకి, నిముషాల మీదే పనులు పూర్తి కావాలనుకునే ఆఫీసరుగార్కి చుక్కెదురైంది.

"నువ్వు బిస్తరు సర్దుకుంటావా! నన్ను పొమ్మంటావా!" అన్నంత దాకా వచ్చింది. అయితే పై ఆఫీసరుగార్కి ఈ వెంకట్రావు బంధువు.

అందుకే ఎవరూ బిస్తర్లు సర్దుకోవలసి రాలేదు.

వెంకట్రావుకు స్వతహాగా లేని చురుకు పాలు, ఈ నిముషంలో, ఉన్నట్లుండి రమ్మంటే ఎక్కణ్నుంచి వస్తుంది?

యథారాజా! తథా ప్రజా!

ఎంతో మంది ఆ సెక్షన్‌కి వస్తుంటారు... తిరిగి పోతూనే ఉంటారు. షరా మామూలే అన్నట్లు... ఈ ముసలతనూ వస్తున్నాడు... పోతు న్నాడు.

పోనీ వచ్చిన వాడు వచ్చినట్లు... పోతున్నాడా! అంటే అదీ లేదు.

ధీమాగా... కంటికి కనిపించే సామ్రాజ్యం అంతా నాదే అన్నట్లు ఆక్రమించుకున్న కుర్చీలో కూర్చుని సిగరెట్లో, బీడీనో నోట్లో పెట్టుకుని, అటూ ఇటూ రెండు నిముషాలు చూసి ఆ తరువాత వెలిగిస్తుంటాడు.

అతని ధీమాను చూసి, వళ్ళు మండి... ఆ వాసనకి వికారం పుట్టి, ఈ ఆఫీసులో నా మాట చెల్లించుకోవలసిన ఆవశ్యకత ఉంది, కాబట్టి "కాస్త మీరు బయటకి వెళ్ళి కాల్చుకోవాలండీ!" అంటూ కసురుకున్నట్లుగా గట్టిగా చెప్పి బయటకి పంపించే దాన్ని.

అలా ఓ రెండు... మూడు సార్లు జరిగాక వెంకట్రావుని కొప్పడ్డా. "ఆ ముసలాడు మీ చుట్టమా!" అని.

ఏమనుకున్నాడో! ఏమో! "అవును" అని మాత్రం చెప్పాడు, ముభావంగా.

అప్పటి నుంచి ఆ ముసలాడి మీద ఏదో తెలియని కోపం చోటుచేసుకుంది నాలో. 'రోజూ తగలడతాడు' అని తిట్టుకునే దాన్ని.


"వచ్చిన పార్టీని అంతసేపు కూర్చోపెట్టుకోకూడదు. ఏదో సమాధానం చెప్పి వెంటనే పంపెయ్యాలి. లేకపోతే మనకు పనులు కావు."

"అసలు మీ సీటు ముందు ఉన్న కుర్చీని తీయించేయండి" అంటూ ఉచితంగా సలహాలు ఇస్తూ ఉండేదాన్ని.

అన్నీ... ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసేవాడు.

ఓసారి చెల్లి పెళ్ళంటూ వారం రోజులు శెలవు పెట్టాడు. అది ఇంపార్టెంటు సెక్షన్ కాబట్టి వెంటనే మరో సెక్షన్ క్లర్కుని ఇన్‌చార్జిగా ఇచ్చారు.

ఎప్పటిలానే ఆ ముసలాడు ఆఫీసుకి వస్తూనే ఉన్నాడు. ఒకటి, రెండు సార్లు చెప్పా "శెలవులో ఉన్నారు" అని.




వెళ్ళి ఇన్‌చార్జిని కలుసుకున్నాడు.

విషయం ఏమిటోగాని, 10 ని.లలోనే అతనికి కావలసిన పని పూర్తయింది.

అతడు పరమానందభరితుడై, 'టీ' తెచ్చే అబ్బాయి అటుగా వస్తే, మా రూమ్ వరకూ అందరికీ 'టీ'లు పంపించాడు.

నాకు అతను ఇప్పించిన 'టీ' త్రాగాలనిపించలేదు.

అతని మీద ఏదో తెలియని కోపం ఏర్పరచుకున్నాను. పైగా అతన్ని ముఖం మీదే విసుక్కున్నాను.

అందుకే "అబ్బే! వద్దండీ! ఇపుడే త్రాగాను" అంటూ తప్పుకోబోయాను.

అయితే ఆ ముసలతను తప్పుకోలేదు.

" 'చాయ్'ది ఏముందండీ! ఎన్ని సార్లయినా తీసుకోవచ్చు" అనడంతో తీసుకోక తప్పింది కాదు.

అతను ఇచ్చిన 'టీ' నా గొంతులోకి దిగుతున్న కొద్దీ, ఆ ముసలతని మీద కోపం మంచు కరిగిపోయినట్లు కరిగిపోయింది.

స్వచ్ఛమైన ఆకాశం.

"ఇక రేపట్నించీ... మా ఆఫీసుకి రావాల్సిన పని ఉండదనుకుంటా!" అన్నా ఆ ముసలతనుతో కృతజ్ఞతగా. పాపం ఇన్నాళ్ళూ తిట్టుకున్నానే అన్న బాధతో కూడా.

"అబ్బే! అదేం లేదులెండి. ఈ ఆఫీసులో మాకు పనులుండకపోతాయా" అంటూ ప్రక్కనున్న వాళ్ళతో కబుర్లలోకి దిగాడు.

అతని 'చాయ్" త్రాగుతున్నందుకు మా రూమ్ అంతా కృతజ్ఞతా భావంతోనే ఉన్నారు, అతని పట్ల.

నెమ్మదిగా ముసలాడు జేబులో చెయ్యి పెట్టాడు. ఈసారి సిగరెట్టు తీసాడు. అగ్గిపెట్టె జేబులో దొరకలేదు. "కాస్త అగ్గిపెట్టె అందుకో" పురమాయించాడు... అటెండరుకి, మా ఆఫీసరు చెప్పినట్లుగానే ఓ చిన్న పని.

"ఆ .... ఇదిగో! సారూ!" వెంటనే అందించాడు, మా అటెండరు తన జేబులోంచి అగ్గిపెట్టె తీసి.

ముసలాడు సిగరెట్టు అంటించాడు.

విలాసంగా, డోర్ దగ్గర నిలబడి, పొగ వదులుతున్నాడు. అది అంతా ఫాన్ గాలికి నా వైపే వస్తోంది.

కడుపులో తిప్పినట్లయింది.

అయితే అతని దయ 'టీ' రూపంలో నా గొంతులోకి దిగింది. రింగులు రింగులుగా వచ్చే ఆ పొగల్ని చూస్తూ ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకోవడం తప్పించి, ఒక్క మాట కూడా నా గొంతులోంచి బయటకు రాలేకపోయింది. ◆